# మూడోసారి కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం పక్కా..





సత్తుపల్లి: వెంగళరావునగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర , గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మానవతారాయ్, వేంసూరు: మాట్లాతున్న సండ్ర తనయులు భార్గవ్, తేజ

వేంసూరు, నవంబర్17: మూడోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కందుకూరు గ్రామంలోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో సత్తుపల్లి నియోజకవర్గ హెటిరో కుటుంబసభ్యుల ఆత్మీయ సమ్మేళన సభను నిర్వహించారు. ఈ సమ్మేళనంలో హెటిరో అధినేత, రాజ్యసభ సభ్యుడు పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజలతో మమేకమై ఒక సామాన్య కార్యకర్తగా నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న సండ్ర వెంకటవీరయ్యకు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ రాబోయే నూతన ప్రభుత్వంలో కేసీఆర్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల మ్యానిఫెస్టోను వివరించారు. ప్రతిఒక్కరూ ఈ పది రోజులు ఎన్నికల ప్రచారంలో పాల్గొని గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిఒక్కరూ కారు గుర్తుపై ఓటు వేసి సండ్ర వెంకటవీరయ్యను నాల్గోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం కందుకూరు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో 60 కుటుంబాలు చేరిక**

సత్తుపల్లి, నవంబర్ 17: తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఆకర్షితులై కాంగ్రెస్‌కు చెందిన 60 కుటుంబాలు శుక్రవారం పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ నాయకులు కోటూరి మానవతారాయ్, కొండూరు సుధాకర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పార్టీలో చేరారని, వారిని తమ గుండెల్లో పెట్టి చూసుకుంటామని భరోసా కల్పించారు. రానున్న ఎన్నికల్లో సత్తుపల్లి అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, గఫార్, నాయకులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న బండి పార్థసారథిరెడ్డి

**తండ్రి గెలుపు కోసం తనయుల ప్రచారం**

వేంసూరు, నవంబర్17: సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలుపును కోరుతూ సండ్ర తనయులు భార్గవ్, తేజ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుపై ఓటు వేసి తమ తండ్రిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. 15 సంవత్సరాల నుంచి సత్తుపల్లిలో మా నాన్నను గెలిపించి అసెంబ్లీకు పంపించారని ఈ సారి కూడా నాన్నను గెలిపించాలని కోరుతున్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ అనుక్షణం నియోజకవర్గ ప్రజల గురించే తపన పడుతున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల నిధులు తెచ్చి సత్తుపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మీ ముందు ఉంచారన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పెనుబల్లి మండలంలో..**

పెనుబల్లి, నవంబర్17: సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలుపు కోసం తనయులు భార్గవ్, తేజ మండలంలోని మండాలపాడు, రామచంద్రరావుబంజర, గౌరవరం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సత్తుపల్లి అభివృద్ధి చూడండి కారు గుర్తుకు ఓటు వేయండి అంటూ ప్రతిఒక్కరినీ ఓటు అభ్యర్థించారు. గత పదిహేనేళ్లుగా మా నాన్న ప్రతి ఇంట్లో ఒక కుటుంబసభ్యుడిగా చూశారని, అదేవిధంగా మరోసారి అవకాశం కల్పించాలని విన్నవించారు.

**తల్లాడలో..**

తల్లాడ, నవంబర్17: సండ్ర వెంకటవీరయ్య గెలుపు కోరుతూ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం తల్లాడలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ దూపాటి భద్రరాజు మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉండే నాయకుడు సండ్ర అని, నియోజకవర్గాన్ని ఆయన కుటుంబంగా, ప్రజలే వారి కుటుంబసభ్యులుగా చూసే సండ్రను అఖండ మెజార్టీతో గెలిపించి నియోజకవర్గం అభివృద్ధిని మరింత ముందుకు తీసుకుపోయే అవకాశం మళ్లీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు జీవీఆర్, పార్టీ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు దూపాటి నరేశ్‌రాజు, ఉపసర్పంచ్ గుండ్ల వెంకటి, వార్డు సభ్యుడు తేళ్లూరి రఘు, నాయకులు మహేశ్, శివ, గోవిందరావు, రాము, మోదుగు బాలకృష్ణ, సత్యం, పాల్గొన్నారు.






పెనుబల్లి: మండాలపాడులో ప్రచారం చేస్తున్న సండ్ర తనయులు భార్గవ్, తేజ, వీఎం బంజరలో నాయకులు, తల్లాడ: ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తల్లాడ, నవంబర్17: తల్లాడ పట్టణ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం మండలంలోని తల్లాడ, నారాయణపురం, మల్లారం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో నాగులచవితి



పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లి టౌన్, నవంబర్ 17: నాగులచవితి సందర్భంగా మండల వ్యాప్తంగా పండుగను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిపారు. పండుగ సందర్భంగా తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించి నువ్వులు, చలిమిడి పిండి తయారు చేసి ఆవుపాలతో పుట్టల వద్దకు చేరుకుని పూజలు చేసి పుట్టలో పాలుపోసి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయాల్లో దర్శనం చేసుకుని పూజలు చేశారు. గుడిపాడు రోడ్‌లో శివాలయం, కాకర్లపల్లి శివాలయాల వద్ద భక్తులు కిటకిటలాడారు.

## గర్భిణులు వైద్యసిబ్బంది సలహాలు పాటించాలి



వ్యాయామంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కారేపల్లి, నవంబర్ 17: గర్భిణులు వైద్యసిబ్బంది సలహాలు, సూచనలు తీసుకోవడం వల్ల సుఖప్రసవాలకు ఎక్కువ అవకాశాలు ఉంటాయని పేరుపల్లి పల్లెదవాఖానా వైద్యురాలు పీ మాధవి అన్నారు. పేరుపల్లి గ్రామంలోని గర్భిణుల ఇంటింటికెళ్లి ఆహార నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. సుఖప్రసవాల వ్యాయామాలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటు లో ఉన్నాయని ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఈసం కృష్ణవేణి, ఆశ కార్యకర్తలు పీ రాంబాయి, పీ రేణుక, బీ లలిత పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు



మాజీ మంత్రి సంభానితో గోళ్ల అప్పారావు, నాయకులు

సత్తుపల్లి రూరల్, నవంబర్ 17: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు గోళ్ల అప్పారావు శుక్రవారం మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గోళ్ల అప్పారావుకు సంభాని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విజయం కోసం కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొర్రపాటి సాల్మన్‌రాజు, కాలం కృష్ణ, వెలిశాల వెంకటాచారి, తోట రాజేశ్, ఇజ్జగాని మధు, చెన్నారావు, సురేశ్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు చేరుకున్న అదనపు బ్యాలెట్ యూనిట్లు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, నవంబర్17: జిల్లాలో ఎన్నికల నిర్వహణకు కావాల్సిన అదనపు బ్యాలెట్ యూనిట్లు శుక్రవారం జిల్లాకు చేరుకున్నాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. శుక్రవారం జడ్పీ కాంప్లెక్స్‌లోని ఈవీఎం గోడౌన్ వద్ద అదనపు బ్యాలెట్ యూనిట్లను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కంటెయినర్ నుంచి తీసి కలెక్టర్ గోడౌన్‌లో భద్రపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ అభ్యర్థులను బట్టి అదనపు బ్యాలెట్ యూనిట్లు అవసరం కాగా, ఎన్నికల సంఘం 894 బ్యాలెట్ యూనిట్లను పంపించారన్నారు. ఈ బ్యాలెట్ యూనిట్లను ఫస్ట్ లెవల్ చెకింగ్ చేసిన అనంతరం ర్యాండమైజేషన్ చేపట్టి, నియోజకవర్గాలకు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డీ మధుసూదన్‌నాయక్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్ స్వామి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి జీ కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి నల్లమోతు తిరుమలరావు, బీజేపీ పార్టీ ప్రతినిధి జీఎస్ఆర్‌పీ విద్యాసాగర్, సీపీఎం ప్రతినిధి ఆర్ ప్రకాశ్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎన్ సత్యం బాబు, టీడీపీ పార్టీ ప్రతినిధి కే కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బాలోత్సవ్‌లో బనిగండ్లపాడు విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం, నవంబర్17: ఈ నెల 14న మధిరలో నిర్వహించిన జాతీయ స్థాయి బాలోత్సవ్-2023లో బనిగండ్లపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. గ్రూప్ డ్యాన్స్, సోలో జానపదం, భరతనాట్యం విభాగాల్లో మూడు ప్రోత్సాహక బహుమతులు సాధించారు. శుక్రవారం పాఠశాలలో అభినందన కార్యక్రమంలో విద్యార్థులకు పాఠశాల పీజీహెచ్‌ఎం రంగారెడ్డి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ వేమిరెడ్డి పాపిరెడ్డి, హెచ్‌ఎం జంగా గురునాథరెడ్డి, ఉపాధ్యాయులు గోలి చిన్నప్ప, శివకుమార్, లక్ష్మి పాల్గొన్నారు.